సాక్షి
ఖమ్మం

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



‘ఉపాధి’కి జీపీల బాసట..

ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో తగిన ఏర్పాట్లు చేసే బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. 8లో



భద్రాద్రిలో ‘బొబ్బల నరసింహుడు’

భద్రాచలానికి వచ్చే భక్తులు గతంలో రామయ్య దర్శనానికి ముందే బొబ్బల నర్సింహస్వామిని దర్శించుకునేవారు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా ఎదుర్కోలు వేడుక

- జమలాపురంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన ఆదివారం శ్రీవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం చేశారు. యాగశాలలో విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. పుణ్యావచనం, అనుష్టానాలు, హోమం జరిపించాక, శ్రీవేంకటేశ్వర స్వామి వారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను నూతన వస్త్రాలతో అలంకరించారు. కాగా, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఎదుర్కోలు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి, అమ్మవార్ల గుణగణాలను అర్చకులు వివరించారు. శ్రీవారి తరఫున ఆలయ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, విజయదేవశర్మ, వేదపండితులు అనంత శయనాచార్యులు, అమ్మవార్ల తరఫున వసంత కుమార్ శర్మ, కాసులనాటి రామకృష్ణశాస్త్రి, రఘురామకృష్ణ, వెంకటరమణ పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను చంద్రప్రభ వాహనంపై గిరి ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు న్యాయవాద సొసైటీ ఎన్నికలు

ఖమ్మం లీగల్: న్యాయవాద సహకార సంఘంలో నాలుగు డైరెక్టర్ల పదవులకు మంగళవారం జరగనున్న ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొత్తం12 మంది డైరెక్టర్లకు గాను ఈ సంవత్సరం ఖాళీ అయిన నాలుగు స్థానాలకు తీవ్ర పోటీ నెలకొంది. డైరెక్టర్ల ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నికోనుండడంతో అధ్యక్ష పదవికి పోటీలో ఉన్నవారు తమకు అనుకూలమైన డైరెక్టర్ల గెలుపునకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. కాగా, ఈనెల 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఖమ్మం బార్ అసోసియేషన్ హాలులో ఎన్నికలు నిర్వహించి, ఫలితాలు వెంటనే ప్రకటిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి: సీపీ సునీల్‌దత్



చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఖమ్మం పోలీస్ శాఖ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాత పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) నరేష్‌కుమార్, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు సతీష్, హనూక్ పాల్గొన్నారు.

రఘునాథపాలెం మండలంలోని చెరువుల్లో పూడిక తీస్తున్న ఉపాధి హామీ కూలీలు



ఉపాధి హామీ పథకంలో...

ఉపాధి హామీ పథకంలో చెరువుల్లో పూడిక తీతతో పాటు, పంటకాల్వల పూడిక పనులు సైతం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావాలంటే ఇంకా రెండు నెలల సమయం ఉంది. ఈ మధ్య కాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల్లో పూడికతీస్తే.. లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తరలించడానికి అవకాశం ఉంది. దీంతో చెరువుల్లో పెద్ద మొత్తంగా నీటి నిల్వలు పెరిగి జలకళ సంతరించుకోవడటంతో పాటు, మత్స్యకారుల ఉపాధి అయిన చేపల పెంపకానికి దోహదపడుతుంది.

చెరువు మట్టి చేలకు..

దరఖాస్తు చేసుకుంటే రైతులకు అనుమతి

- జిల్లాలో వెయ్యి చెరువుల్లో తవ్వకానికి అవకాశం
- ఇప్పటికే 200 చెరువులకు అనుమతి
- ఒండ్రు తొలగింపుతో పెరగనున్న నీటి సామర్థ్యం

ఖమ్మంఅర్బన్: చెరువుల్లో పూడిక తీతతో నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాల అభివృద్ధితో పాటు చెరువుల పరిధిలో ఆయకట్టు సాగుకు నీరు అందుబాటులోకి వస్తుంది. చెరువుల్లోని ఒండ్రు మట్టిని పంట పొలాల్లో పోయడం ద్వారా ఆ భూముల్లో సాంద్రత పెరిగి, అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం రైతులు తమ భూముల పత్రాలను అధికారులకు అందించి చెరువు మట్టి తోలుకోవడానికి అనుమతి పొందవచ్చు. గతంలో జలవనరుల శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే.. వారికి తీరినప్పుడు వచ్చి భూములను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే అనుమతి ఇచ్చేవారు. కాగా, ప్రస్తుతం కలెక్టర్ వీ.పీ.గౌతమ్.. వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో ఈ ప్రక్రియను సులభతరం చేశారు. రైతులు తమ పరిధిలోని ఏఈఓలకు భూమి పత్రాలు అందించి, చెరువు మట్టి తవ్వకానికి దరఖాస్తు చేసుకుంటే, వారు పరిశీలించి అనుమతి కోసం జలవనరుల శాఖ అధికారులకు పంపుతారు. తద్వారా రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. బీఆర్ఎస్ మొదటి సారి అధికారంలోకి వచ్చాక మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువుల్లో పేరుకుపోయిన పూడిక, కంపచెట్లు, అలుగులు, తూములు, చెరువుకట్టలు, పంటకాల్వల మరమ్మతు పనులు చేశారు. దశల వారీగా 90 శాతం చెరువులను అభివృద్ధి చేయడంతో నీటి నిల్వలు సమృద్ధిగా పెరిగాయి. అయితే ఆ తర్వాత కాలంలో వాటిపై అంతగా దృష్టి సారించకపోవడంతో మళ్లీ యథాతథ స్థితికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు ఖర్చు లేకుండా చెరువు మట్టిని తవ్వుకెళ్లడంతో అటు ప్రభుత్వానికి, ఇటు రైతులకు మేలు జరగనుంది.

అనువుగా 1,000 చెరువులు

జిల్లాలో 1,400 పైగానే చెరువులు ఉన్నాయి. వీటిలో 1000 చెరువుల్లో పూడిక తీసే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. ఆయా చెరువుల్లో మాత్రమే జలవనరుల శాఖ అధికారులు అనుమతి ఇస్తారు. రై తులు మట్టి తవ్వడంతో పాటు ఉపాధి హామీ కూలీలు సైతం మట్టి తవ్వితే రైతులు సొంతంగా ట్రాక్టర్లతో పొలాలకు తరలించుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో చెరువుల్లో మట్టి తవ్వకం పనులు జోరుగా సాగుతుండగా, రైతులు మట్టి తోలకానికి అనుమతి కోసం వందల సంఖ్యలో అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 200 పైగా ప్రాంతాల్లో జలవనరుల శాఖ ఈఈలు అనుమతులు ఇచ్చారు. చెరువుల్లో పేరుకుపోయిన పూడిక లెవల్ వరకు మాత్రమే తవ్వాలని, పెద్ద పెద్ద గుంతలు కాకుండా సమాంతరంగా తవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ మట్టిని వ్యవసాయ అవసరాలకు మాత్రమే వినియోగించుకుంటామని రైతుల నుంచి హామీ పత్రం తీసుకుంటున్నారు. మట్టిని పక్కదారి పట్టిస్తే సదరు రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

డివిజన్ల వారీగా అనుమతులు ఇలా..

మట్టి తవ్వకానికి జలవనరుల శాఖ ఈఈ స్థాయిలోనే అనుమతి పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అందిన వివరాల ప్రకారం.. ఖమ్మం డివిజన్ నుంచి ఐదు చెరువుల్లో అనుమతి ఇవ్వగా, మరో రెండు చెరువుల పరిధిలో అనుమతి ఇవ్వాల్సి ఉంది. వైరా డివిజన్ పరిధిలో 55 చెరువుల పరిధి నుంచి దరఖాస్తులు అందగా ఇప్పటికే 30 చెరువుల పరిధిలో అనుమతి జారీ చేశారు. సత్తుపల్లి డివిజన్ పరిధిలో 12 చెరువుల్లో, మధిర డివిజన్ పరిధిలో 34 చెరువుల పరిధిలో అనుమతులు జారీ చేయగా.. కల్లూరు డివిజన్ పరిధిలో 80 దరఖాస్తులకు గాను 56 చెరువుల పరిధిలో అనుమతి ఇచ్చారు.

అవకాశం ఉంటే ఎప్పటికప్పుడు అనుమతి

చెరువుల్లో పూడిక మట్టిని రైతులు తమ పొలాలకు తరలించుకోవాలంటే సరైన పత్రాలను సమర్పించి ఈఈల పరిధిలోనే అనుమతి పొందొచ్చు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి అవకాశం మేరకు అనుమతి ఇస్తున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో అనుమతులు జారీ చేశాం. ఇదే సమయాన మట్టి పక్క దారి పట్టిస్తే మాత్రం చర్యలు తప్పవు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తే సంబంధింత రైతులపై చర్యలు ఉంటాయి.

– విద్యాసాగర్, జలవనరుల శాఖ సీఈ

అవసరాలకు అనుగుణంగా నిర్మించాలి

వైద్య కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

ఖమ్మంఅర్బన్: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. బల్లేపల్లి రెవెన్యూ, రఘునాథపాలెం గ్రామాల్లో కళాశాల నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌తో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైవే రోడ్డుకు కళాశాల ప్రధాన భవనం ఫేసింగ్ ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం తహసీల్దార్లు సీహెచ్.స్వామి, విల్సన్ బెన్నీ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి..

విలువైన ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఫెన్సింగ్‌తో పాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఖానాపురం రెవెన్యూ సర్వే నంబర్ 37లో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ చర్యలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. ఫెన్సింగ్ వేసిన స్థలాల్లో స్థానిక పిల్లలు, యువతకు క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



వైద్య కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ తదితరులు

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఖమ్మం సహకారనగర్ : మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుంటూ వారు చూపిన మార్గంలో నడవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. ఆ రాజ్యాంగం మేరకే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని చెప్పారు. అంబేద్కర్ గొప్ప మేధావి అని, రాజకీయ, సామాజిక, ఆర్థిక వేత్త అని కొనియాడారు. అంబేద్కర్ జీవితమే ఒక సందేశమని, చిన్నతనంలో తాను పడిన కష్టాలు మరొకరు పడకుండా రాజ్యాంగ రచనలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. చాలా దేశాల్లో ఇప్పటికీ అందరికీ ఓటుహక్కు లేదని, భారత రాజ్యాంగంలోనే అందరికీ సమానత్వం, ఓటుహక్కు కల్పించారని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, డీఆర్ఓ ఎం.రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంచామని, అభ్యర్థులకు నామినేషన్‌పై సందేహాలుంటే నివృత్తి చేస్తారని చెప్పారు. పోటీచేసే అభ్యర్థులు, ప్రతిపాదకుల ఓటు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉంది, సీరియల్ నంబర్ తదితర వివరాలు హెల్ప్‌డెస్క్ ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల సూపరింటిండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో పాలన



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చింది
- గత పాలకుల తప్పిదాలను బయటకు తీస్తాం
- అంబేద్కర్ గొప్ప సామాజికవేత్త
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మంమయూరిసెంటర్ లేదా ఖమ్మంవన్‌టౌన్: రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన అందిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తర్వాత భట్టి మాట్లాడుతూ.. ప్రపంచ మేధావిగా వివిధ దేశాల చట్టాలను అధ్యయనం చేసి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన గొప్ప సామాజిక వేత్త అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తమ ప్రభుత్వంలో ప్రతీ పేదవాడికి న్యాయం చేసేలా సమష్టిగా ముందుకు సాగుతున్నామన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు కొన్ని పార్టీలు కుట్ర పన్నుతున్నాయని, ప్రజాస్వామికవాదులు ఆ కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల వ్యయాన్ని అపరిమితంగా పెంచారని, కాళేశ్వరం ప్రాజెక్ట్ అంచనాలను సైతం పెంచి రాష్ట్రంలో ఆర్థిక దోపిడీకి కల్వకుంట్ల కుటుంబం తెరలేపిందని ఆరోపించారు. రూ.లక్ష కోట్లు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ఇప్పుడు నిరుపయోగంగా మారిందన్నారు. ఇంపోర్టెడ్ బొగ్గు తీసుకొచ్చి కాలుష్యం లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తామని చెప్పి అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని తమ చేతిలో పెడితే, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఒక్కొక్కటిగా సంక్షేమ ఫలాలను పేదలకు అందిస్తున్నామని చెప్పారు. నాణ్యమైన విద్యుత్‌ను కోత లేకుండా అందిస్తున్న తమపై దిగజారి విమర్శలు చేయడం బీఆర్ఎస్‌కు తగదన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనకు, తమ మూడు నెలల పాలనకు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రజా వ్యతిరేక పాలన అందించిన పార్టీలకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఏపీ సీఎం జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, అలాంటి కార్యక్రమాలు ఎవరు చేసినా సమాజానికి మంచిది కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై శనివారం జరిగిన రాళ్ల దాడిపై ఆయన స్పందించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ సంఘటన్ ఏఐసీసీ కన్వీనర్ కిరణ్ ముగభాత్సవ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్పొరేటర్లు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, వడ్డెబోయిన నర్సింహారావు, ఎర్రం బాలగంగాధర తిలక్, యడ్లపల్లి సంతోష్, దీపక్‌చౌదరి, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్, గజ్జెళ్లి వెంకన్న, మిక్కిలినేని నరేందర్, ఏలూరి రవికుమార్, బోజెడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు తుమ్మల నివాళి..

బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాపర్తి శరత్, పెండ్ర అంజయ్య, క్యూర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారు జైలుకే..

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా : రాష్ట్రంలో అందరి కష్టానికి ఫలితంగా ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, ఇక ఎవరికీ కష్టాలు, కన్నీళ్లు ఉండవని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వైరాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కొనసాగుతోందని, త్వరలో ఆధారాలు బయటకు వస్తాయని, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కూడా జైలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమని అన్నారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న భూములను కొల్లగొట్టారని, రూ.వేల కోట్లు దోచుకుని రాష్ట్రంలో రూ.7 లక్షల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్, తన ఫోన్‌తో పాటు రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి ఫోన్లు ట్యాప్ చేశారని, అందరి స్వేచ్ఛను హరించారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో రూ.46 వేల కోట్లు ఖర్చు చేసిందని, కనీసం 60 శాతం మంది ప్రజలకు కూడా సరైన తాగునీరు అందడం లేదని అన్నారు. సాగు నీటి విషయంలోనూ కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రైతులను రెచ్చగొడుతూ సామాన్య ప్రజలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పంపిణీలో కూడా కేసీఆర్ కుంభకోణాలకు పాల్పడ్డారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లాలో నక్కల్లా తిరుగుతున్నాయని, త్వరలో సింహం బయటకు వస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని, అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ కుల, మతాల మధ్య చిచ్చుపెడుతోందని, అయోధ్య, అక్షింతల పేరుతో అధికారంలోకి వచ్చిందని అన్నారు. హామీల అమలులో విఫలమైన ఆ పార్టీకి సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి ఎవరైనప్పటికీ హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. త్వరలో ప్రతి మండలంలో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో మంత్రులందరం కలిసికట్టుగా పని చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, పగడాల మంజుల, వడ్డె నారాయణరావు, లేళ్ల వెంకటరెడ్డి, కోసూరి శ్రీనివాసరావు తదితరులున్నారు.

రైలు ప్రయాణం.. ఇక నిశ్చింత

- యాప్‌లో జనరల్ టికెట్ బుక్ చేసుకునే అవకాశం
- రద్దీ సమయంలో తప్పనున్న ఇక్కట్లు
- స్టేషన్లలో ప్రచారం చేస్తున్న రైల్వే శాఖ



వైరా: రైలు ప్రయాణమంటే మామూలు హడావిడి కాదు. ఇంటి నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం, లగేజీ, పిల్లలతో వెళ్లడం.. తీరా టికెట్ తీసుకుందామంటే అక్కడ చాంతాడంత క్యూ.. రైలు వెళ్లిపోతుందేమోనన్న ఆత్రుత.. ఇకపై ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ.. ఇంట్లో నుంచే జనరల్ టికెట్ బుక్ చేసుకునే అవకాశం వచ్చింది. ప్రయాణికుల ఇక్కట్లను తీర్చేందుకు రైల్వే శాఖ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యూటీఎస్(అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టం) ఆన్ మొబైల్ యాప్ సదుపాయాన్ని కల్పించింది. సాధారణ టికెట్‌పై ప్రయాణించాలనుకునే వారు అదే రోజున ఈ యాప్ ద్వారా టికెట్ పొందొచ్చు. జిల్లాలోని రైల్వేస్టేషన్లలో ఈ యాప్ ద్వారా ప్రయాణికులు సాధారణ, సీజనల్, ప్లాట్‌ఫాం టికెట్లు కొనుగోలు చేస్తున్నారు. రైల్వే అధికారులు ఈయాప్ ద్వారా ఎలా టికెట్ తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు.

పాటించాల్సిన నిబంధనలు...

వినియోగదారులు రైలు ప్రయాణం చేసే రోజునే టికెట్ బుక్ చేసుకోవాలి. టికెట్ బుక్ అయిన గంటలోపే రైలు ఎక్కాలి. రైలులో ప్రయాణిస్తున్నప్పుడు టికెట్ బుక్ కాదు. స్మార్ట్‌ఫోన్‌లో జీపీఆర్ఎస్ యాక్టివేషన్‌లో ఉండాలి. టికెట్ పొందడం, ప్రయాణ సమయంలో సమస్యలు, ఇబ్బందులు ఉంటే యూటీఎస్ యాప్‌లోని హెల్ప్ కస్టమర్ కేర్ నంబర్ల ద్వారా సంప్రదించి సాయం పొందవచ్చు.

రద్దీ సమయంలో సులువు..

‘క్యూ’ వద్దు...‘క్యూ ఆర్ కోడ్ ముద్దు.. అంటూ యూటీఎస్ యాప్ ద్వారా తక్షణమే టికెట్ పొందాలని రైల్వేశాఖ ప్రచారం చేపడుతోంది. ప్రధానంగా పెద్ద రైల్వేస్టేషన్లలో పండుగలు, సెలవులు, ప్రత్యేక రోజుల్లో రైలు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. టికెట్ కొనుగోళ్లకు కౌంటర్ల వద్ద పెద్ద సంఖ్యలో బారులుదీరుతారు. ఆ సమయంలో ఈ యాప్ ద్వారా జనరల్ టికెట్ కొనుగోలు చేసి దేశంలో ఎక్కడికైనా.. ఏ రైలులోనైనా ప్రయాణించవచ్చు. బుకింగ్ కౌంటర్ల వద్ద గంటల కొద్దీ నిలబడటం, టికెట్ కొనేందుకు ఆలస్యం కావడంతో రైలు ఎక్కడ వెళ్లిపోతుందో.. ఎక్కలేస్తామో లేదో అనే ఆందోళనలు దూరం అవుతాయి.

యాప్‌లో నమోదు...

జీపీఆర్ఎస్ యాక్టివేషన్ ఉన్న స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉన్నవారు గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యూటీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా www.utsonmobile.indianrail.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి యూటీఎస్ యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత ఫోన్ నంబరు, పేరు, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నంబరు నమోదు చేసిన వెంటనే వినియోగదారుడి పేరున ఖాతా రిజిస్ట్రేషన్ అవుతుంది.

టికెట్ బుకింగ్...

యూటీఎస్ యాప్ తెరిచి ఫోన్ నంబరు, పాస్‌వర్డ్‌తో తమ ఖాతాలోకి లాగిన్ అవాలి. టికెట్ ఎలా పొందాలో వివరాలున్న తెర కనిపిస్తుంది. ఇందులో సాధారణ బుకింగ్, క్విక్ బుకింగ్, ప్లాట్‌ఫాం బుకింగ్, సీజన్ బుకింగ్, క్యూఆర్ బుకింగ్, క్యాన్సిల్ టికెట్, బుకింగ్ హిస్టరీ, షో టికెట్, ఆర్‌-వ్యాలెట్, ప్రొఫైల్, హెల్ప్ వంటి వివరాలు కనిపిస్తాయి. సాధారణ బుకింగ్‌లో బుక్ అండ్ ట్రావెల్, బుక్ అండ్ ప్రింట్, టికెట్ ఏ స్టేషన్ నుంచి ఏ స్టేషన్ వరకు వివరాలు ఉంటాయి. టికెట్ బుకింగ్ కోసం సాధారణ బుకింగ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత ఎక్కాల్సిన, దిగాల్సిన స్టేషన్ వివరాలు ప్రయాణికుల సంఖ్య వివరాలు నమోదు చేయాలి.

చెల్లింపు ఇలా..

యాప్‌లో గెట్ ఫేర్ ఆప్షన్ ద్వారా టికెట్ ధర తెలుసుకోవాలి. కొనుగోలు నగదు చెల్లింపును ఆర్‌-వ్యాలెట్, క్రెడిట్, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, డిజిటల్ పేమెంట్ యాప్‌ల ద్వారా చేపట్టవచ్చు. షో టికెట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే బుక్ చేసిన టికెట్ వివరాలు, వ్యూ టికెట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే టికెట్ కనిపిస్తాయి. కాగిత రహిత టికెట్ బుక్ చేసుకున్నవారు తమ స్మార్ట్‌ఫోన్‌లో టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని ప్రయాణంలో టీసీకి చూపించాలి. ప్రింటెడ్ టికెట్ ఆప్షన్ ఎంచుకున్న వారు రైల్వేస్టేషన్‌లోని ఏటీవీఎం, కో-టీవీఎం, ఓసీఆర్ యంత్రాలు, ఓటీఎస్ బుకింగ్ కౌంటర్‌లో ఫోన్ నంబర్, బుకింగ్ ఐడీ నంబర్ నమోదు చేసి టికెట్ ప్రింట్ తీసుకోవాలి.

చైతన్యవంతమైన రీజియన్.. ఖమ్మం

- అంబేద్కర్ స్ఫూర్తితో తోటి వారికి సాయపడాలి
- ఆర్టీసీ ఆర్ఎం వెంకన్న

ఖమ్మంమయూరిసెంటర్ : రాష్ట్రంలోనే ఆర్టీసీ సంస్థలో ఖమ్మం రీజియన్ చైతన్యవంతమైనదని, ఇక్కడ పని చేసే సిబ్బంది, ఉద్యోగులు, ప్రజలు చైతన్యవంతంగా ఉంటారని ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ చెరుకుపల్లి వెంకన్న అన్నారు. ఆదివారం ఖమ్మం నూతన బస్టాండ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన పుస్తకాలు చదవడం ద్వారా సమాజానికి ఏ విధంగా సాయపడగలమనేది తెలుస్తుందన్నారు. ఆయన స్ఫూర్తితో తోటి వారికి సాయపడాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలో ఉన్న చైతన్యం ఇతర జిల్లాల్లో చూడలేదన్నారు. ఆర్టీసీ సంస్థకు ప్రస్తుతం మంచి లాభాలు వస్తున్నాయని, మార్చిలో ఖమ్మం రీజియన్ నుంచి రూ.15 కోట్లు లాభం వచ్చిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం రీజియన్ నుంచి రూ.115 కోట్లు లాభం రావచ్చని యాజమాన్యం అంచనా వేస్తోందని చెప్పారు. కొత్తగా ఏ బస్సులకూ డబుల్ డోర్ పెట్టే యోచన లేదని, డబుల్ డోర్ ఉన్న పాత బస్సులకు మాత్రమే పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) జీఎస్ పవిత్ర, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) భవాని ప్రసాద్, పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, అకౌంట్స్ ఆఫీసర్ బాలస్వామి, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీ సీఎంపై దాడిని ఖండిస్తున్నాం..

ఖమ్మంమయూరిసెంటర్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, జనహృదయ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అభిమాని, వైఎస్సార్‌సీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి వేమిరెడ్డి రోశిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఎన్నికల రణరంగంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేకనే ప్రతిపక్ష కూటమి ఇలాంటి దారుణమైన దాడులకు పాల్పడుతోందని, ఇది హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు మంచిది కాదని, ప్రజల ఆశీర్వాదం ఉంది కాబట్టి జగన్‌మోహన్‌రెడ్డికి పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు.

సత్తుపల్లివాసికి డాక్టరేట్


సూరం శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లిలోని జలగంనగర్‌కు చెందిన సూరం శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వృక్ష శాస్త్రం విభాగంలో డాక్టరేట్ లభించింది. వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ పీఆర్ సుష్మ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించారు. ఆయన ప్రస్తుతం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. గతంలో శాంతినికేతన్, నవభారత్, గీతమ్స్ డిగ్రీ కళాశాలల్లో పనిచేశారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి డాక్టరేట్ లభించటంపై గీతమ్స్ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరెడ్డి, కళాశాలల చైర్మన్ గాదె నర్సింహారెడ్డి, డైరెక్టర్లు జీవీ లింగారెడ్డి, ఎల్ఎస్ రెడ్డి, ఎం.నర్సారెడ్డి, ఎం.వాసుదేవరావు అభినందనలు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ


సీతారాములును ఖమ్మం తరలిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పైనంపల్లి గ్రామం వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మంగాపురంతండాకు చెందిన భూక్యా సీతారాములు, రమాదేవి దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పైనంపల్లి గ్రామ శివారులోని సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వెళ్తుండగా ప్రమాదం జరగగా క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

చైన్‌స్నాచర్‌ను గుర్తిస్తే పారితోషికం


గుర్తుతెలియని వ్యక్తి

ఖమ్మంక్రైం: నగరంలో శనివారం రోటరీనగర్ వద్ద ఓ వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కొని పోవటానికి యత్నించిన గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇస్తామని నగర ఏసీపీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధురాలు పెనుగులాడటంతో ఆ వ్యక్తి బైపాస్ రోడ్డువైపు ఎఫ్–జడ్ ద్విచక్రవాహనంపై పారిపోయాడని, ఆయన సమాచారం తెలిస్తే ఖమ్మం ఏసీపీ 87126 59105, టూటౌన్ సీఐ 87126 59110 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తులు బైకులపై ఎదురుగా, మన వెనుక నుంచి వస్తే అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు.

బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు

కామేపల్లి: పండితాపురం గ్రామంలో ఇద్దరు బెల్ట్ షాపు నిర్వాహకులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన పత్తి ఉప్పమ్మ, వల్లభనేని నర్సింహారావు దుకాణాల్లో తనిఖీలు చేయగా 29 మద్యం బాటిళ్లు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

కారేపల్లి: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృత్యువాత పడిన ఘటన మండలంలోని భాగ్యనగర్‌తండాలో ఆదివారం చోటుచేసుకుంది. భాగ్యనగర్‌తండా రైతులు భగవాన్‌కు చెందిన దుక్కిటెద్దు గ్రామానికి సమీపంలో నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు మేతమేసేందుకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని, ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే దుక్కిటెద్దు మృత్యువాత పడిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

టిప్పర్ పట్టివేత

కామేపల్లి: అధిక కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను ఆదివారం మైనింగ్ అధికారులు పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పరిమితికి మించిన లోడుతో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

‘ఉపాధి’కి పంచాయతీల బాసట


బాణాపురం వద్ద కూలీల కోసం వేసిన టెంట్, తాగునీటి క్యాన్లు

- ఉపాధి కూలీలకు పంచాయతీలు నీడ, తాగునీరు కల్పించాలి..
- ఎవరూ వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు

నేలకొండపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్న కూలీల దాహార్తి తీర్చడంతోపాటు వారికి నీడ కల్పించే బాధ్యతను ఆయా గ్రామపంచాయతీలకు అప్పగించింది. ఈ మేరకు ఆయా పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని చోట్ల ఇప్పటికే ప్రారంభించారు. ఇందు కోసం ఒక్కోకూలీకి 2 లీటర్ల తాగునీటికి రూ.2.50 చెల్లించనున్నారు. ఏరోజుకారోజు నీటిని తీసుకురావాల్సి ఉంటుంది. ఎండ దెబ్బ తగలకుండా నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు.


నేలకొండపల్లి జీపీకి చేరిన టెంట్లు

రోజుకు 80 వేల మందికి పైగా..

ఖమ్మం జిల్లాలోని 589 గ్రామపంచాయతీల్లో ప్రతీ రోజు దాదాపుగా 80 వేలకు పైగా ఉపాధి కూలీలు పనులను ఉపయోగించుకుంటున్నారు. వీరు పని చేసే ప్రాంతాల్లో తాగునీరు లేక అల్లాడుతున్నారు. కేంద్రం నిర్ణయంతో పంచాయతీ కార్యదర్శులు కూలీలకు తాగునీటి వసతి కల్పించాల్సి ఉంటుంది. జిల్లాలోని పలు పంచాయతీల్లో అమలు చేస్తున్నారు.

కూలీలకు నీడ కోసం..

జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక చొరవతో కూలీలు పనులు చేస్తున్న ప్రాంతంలో నీడ కల్పించేవిధంగా ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక నిధుల ద్వారా ప్రతీ పంచాయతీకి రెండు టార్పాలిన్లు చొప్పున టెంట్లు అందించారు. దీంతో పనులు చేసే ప్రాంతంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వాటిని ఏర్పాటు చేయటంతో ఎండ నుంచి ఉపశమనం కలిగింది. చెట్ల కింద కూర్చోని సేద తీరాల్సిన అవసరం లేకుండా ప్రస్తుతం టెంట్ల కింద కూర్చుంటున్నారు. నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో దాదాపు 200 మందికి పైగా పనులు చేస్తుండటంతో అక్కడ కార్యదర్శి దేవేందర్ దాదాపు 10 టెంట్లను కిరాయికి తెచ్చి అందుబాటులో ఉంచారు.

కానీ ఇంకా పలు మండలాల్లో ఏర్పాట్లు నత్తనడకన సాగుతున్నాయి. తాగునీరు అందేలా చేస్తున్న ప్రభుత్వం ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉండేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.

తాగునీరు, నీడ కల్పించాల్సిందే..

పనులకు వస్తున్న కూలీలకు తాగునీటిని ఇకపై పంచాయతీలు అందుబాటులో ఉంచాలని ఉత్తర్వులు అందాయి. ప్రతీ పంచాయతీలో ఏర్పాటు చేయాల్సిందే. కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా టెంట్లు అందుబాటులో ఉంచాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

–సన్యాసయ్య, డీఆర్‌డీఓ

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సంస్కరణలు


నివాళులర్పిస్తున్న ఎంపీలు నామ, వద్దిరాజు ఎమ్మెల్సీ మధు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: టీఆర్ఎస్ అధికారం చేపట్టిన అనతికాలంలోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ ఎన్నో సంస్కరణలు తెచ్చారని బీఆర్ఎస్ ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ పేర్కొన్నారు. ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఎన్నో సంస్కరణలు తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రాములునాయక్, మేయర్ నీరజ, కూరాకుల నాగభూషణం, రాజేంద్ర, పగడాల నాగరాజు, బెల్లం వేణు, తాళ్లూరి జీవన్, తాజుద్దీన్, సాజిద్, లింగాల రవి, కన్నం ప్రసన్న, డోలె ప్రసన్నలక్ష్మిసాయి, దాదే అమృత సతీశ్, షకీన, అబ్బాస్ పాల్గొన్నారు.

హోటళ్లు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు


హోటల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఖమ్మం హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు చేపడుతున్నట్లు సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఎన్నికల ముందు తీసుకునే చర్యల్లో భాగంగా పోలీస్ కమిషనరేట్‌వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశామని, అందులో భాగంగా శనివారం అర్ధరాత్రి వరకు అన్ని హోటళ్లు, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని చెప్పారు. అనుమానిత, సరైన పత్రాలు లేకుండా బస చేసే వ్యక్తులు, ఆధార్‌కార్డులు ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని హోటల్, లాడ్జీల యజమానులకు సూచించారు. రిసెప్షన్ వెలుపలి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మైనర్లకు గదులు ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

అడవి జోలికొస్తే సహించం

- రూ.56 లక్షలతో ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్
- భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమానాయక్


అర్బన్‌పార్కును పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్ తదితరులు

సత్తుపల్లిటౌన్ : అడవులను ఆక్రమించడం, నిప్పు పెట్టడం, వన్యప్రాణులను వేటాడటం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ భద్రాద్రి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) డి.భీమానాయక్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్‌తో కలిసి సత్తుపల్లి అర్బన్ పార్కులో సావనీర్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గొల్లగూడెంలో 50 ఎకరాల్లో మొక్కల పెంపకం కోసం సిద్ధం చేసిన అటవీ భూమిని పరిశీలించారు. సత్తుపల్లి మండలం చెరుకుపల్లిలోని నర్సరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి అటవీ శాఖ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. అడవులు అంతరించిపోతే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సత్తుపల్లి అర్బన్ పార్కులో రూ.56 లక్షలతో ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ మంజూరైందని, ఎన్నికల కోడ్ అనంతరం టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఈ సెంటర్‌లో వన్యప్రాణులు, అడవులపై ప్రజలకు త్రీడీ పిక్చర్లతో అవగాహన కల్పిస్తామన్నారు. సావనీర్ షాప్‌లో ఫారెస్ట్ లోగోతో టీషర్టులు, క్యాప్‌లు, పెన్నులు విక్రయించే స్టాల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల తల్లాడ రేంజ్‌లో అటవీశాఖ అధికారి రామారావు చాలా చాకచక్యంగా వన్యప్రాణుల వేటగాళ్లను పట్టుకున్నారని అభినందించారు. అడవుల్లో ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక నీటి సదుపాయం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. వీటితో వన్యప్రాణుల దాహార్తి తీర్చుతున్నామని చెప్పారు. లంకపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని గుట్ట తవ్వకాలపై ఫిర్యాదులు వచ్చాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, ఎఫ్ఆర్ఓ స్నేహలత, డీఆర్ఓ ముత్యాలరావు, ఎఫ్ఎస్ఓలు పి.నర్సింహా, మంగారావు, మధన్, బీట్ ఆఫీసర్లు ముక్తి వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి కారును ఢీకొట్టిన ట్రాక్టర్


ధ్వంసమైన దుర్గాప్రసాద్ కారు

ఖమ్మంఅర్బన్: డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కారును ఆదివారం ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, ఖమ్మం – వైరా ప్రధాన రహదారిలో వెలుగుమట్ల అటవీ పార్కు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో దుర్గాప్రసాద్ తన కారుకు ముందున్న కారులో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఖమ్మంఅర్బన్ సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. వైరా నుంచి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాయల నాగేశ్వరరావు ఖమ్మం వస్తున్నారు. నాగేశ్వరరావు కారులో దుర్గాప్రసాద్ ఉన్నారు. ఈ క్రమంలో నగర పార్కు రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుని రాంగూరూట్‌లో వచ్చిన ట్రాక్టర్ దుర్గాప్రసాద్ కారును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న కాంగ్రెస్ నాయకులు నల్లమోతు రవి, బచ్చలకూర నాగరాజు, మూడుముంతల గంగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దుర్గాప్రసాద్ కారు డ్రైవర్ మహ్మద్ బేర్ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

సత్తుపల్లిలో చోరీ

సత్తుపల్లి: పట్టణంలోని ఓ నివాసంతో పాటు కాకర్లపల్లిలోని ఓ ఆలయంలో చోరీ జరిగిన ఘటనలు శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నాయి.. సత్తుపల్లిలోని రాజీవ్‌రోడ్‌లో నివాసం ఉంటున్న రామిశెట్టి సుబ్బారావు శనివారం ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఆయన కుమారుడు లక్ష్మణ్‌రావు యథావిధిగా తన మొబైల్‌లో సీసీ కెమెరాలను శనివారం రాత్రి ఒంటిగంట సమయంలో పరిశీలిస్తుండగా దొంగలు ఇంటి తలుపులు పగులకొడుతున్న శబ్దాలు వినిపించాయి. కొద్ది సేపటికే సీసీ కెమెరా ప్రసారం నిలిచిపోయింది. వెంటనే అప్రమత్తమై పక్కన ఉన్నవారికి ఫోన్ చేసినా స్పందించక పోవటంతో సమీపంలోని వారిని అప్రమత్తం చేయటంతో ఇంటి ముందుకు వచ్చి అలజడి చేశారు.

ఎవరూ కన్పించటం లేదని చెప్పారు. ఇంతలో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించగా ఇంట్లోని బీరువాను పగులగొట్టినట్లు గుర్తించారు. కాకర్లపల్లిలోని వినాయకుడి గుడిలో ఉన్న హుండీని దొంగలు పగులగొట్టి అందులోని నగదు అపహరించారు. ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

బోనకల్: బోనకల్ – మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 40 ఏళ్ల వయస్సు గల ఈ వ్యక్తి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తోటి ప్రయాణికులు స్టేషన్‌మాస్టర్‌కు సమాచారమిచ్చారు. మృతుడు చామనచాయ, కోలముఖం కలిగి ఉన్నాడు. బ్లూ షర్ట్, బూడిద రంగు ప్యాంట్ వేసుకున్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించేందుకు అన్నం సేవా సమితి అధినేత అన్నం శ్రీనివాసరావుకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

అంతర్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు షురూ


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో శ్రీరామనవమి సందర్భంగా మంత్రి పొంగులేటి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడురోజుల పాటు ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం ఉంటుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

తిరుమలాయపాలెం: స్నేహితుడిని దించేందుకు వెళ్లి ఇంటికి వస్తుండగా చెట్టుని ఢీకొని విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటన తిరుమలాయపాలెం భవాని హోటల్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మంరూరల్ మండలం దానవాయిగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ శ్రీనివాస్, మంగమ్మ దంపతులకు కుమారుడు తరుణ్ (20), కుమార్తె సాహిరి ఉన్నారు. ఖమ్మంలో ఫామ్‌డీ చదువుతున్న తరుణ్ తన బైక్‌పై స్నేహితుడిని దించేందుకు తొర్రూర్ వెళ్లాడు. తిరిగి రాత్రి సమయంలో ఇంటికి వస్తుండగా తిరుమలాయపాలెం భవానీ హోటల్ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న చెట్టుని ఢీకొని పంట పొలాల్లో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్తున్న ప్రయాణికులు యువకుడు మృతిచెంది ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నత స్థితికి చేరుతాడని ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు.. కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నవారు అరెస్ట్

సత్తుపల్లిటౌన్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మండలంలోని సత్యంపేట గ్రామంలోని ఏగోటి పెద్దిరాజుకి చెందిన కొబ్బరి తోటలో అశ్వారావుపేటకు చెందిన ఆకుల శేఖర్, ఆకుల వెంకటేశ్వరరావు మరో ఇద్దరు మైనర్లతో కలిసి సెల్‌ఫోన్‌లో క్రికెట్ మ్యాచ్ చూస్తూ లాప్‌టాప్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో దాడి చేసి అక్కడ ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. క్రికెట్ బెట్టింగులు నడుపుతున్న ఏగోటి పెద్దిరాజుకు అసిస్టెంట్లుగా వీరు పని చేస్తున్నట్లు తేలిందని సీఐ కిరణ్ తెలిపారు. వారి వద్ద నుంచి లాప్‌టాప్, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.13,260 నగదు, ఒక నోట్‌బుక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కిరణ్ తెలిపారు.

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య

కామేపల్లి: అనారోగ్య సమస్య, ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి హరిశ్చంద్రాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అజ్మీర రాంబాబు (46) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీనికితోడు వ్యవసాయంలో పంటదిగుబడి ఆశించినస్థాయిలో రాలేదు. ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

భద్రాద్రిలో ‘బొబ్బల నరసింహుడు’

- రామయ్య కంటే ముందే దర్శనం
- పాపికొండల్లో ఉద్భవించిన స్వామివారు
- వైశాఖ పూర్ణిమనాడు తిరుకల్యాణోత్సవం


భద్రాచలంలోని యోగానంద లక్ష్మీనరసింహుడి ఆలయం

భద్రాచలం: తిరుమల వెళ్లే భక్తులు శ్రీవారి దర్శనానికి ముందు వరహాస్వామిని దర్శించుకునే ఆనవాయితీ పాటిస్తారు. ఇదే తరహా సంప్రదాయం భద్రాచలంలోనూ ఉంది. ఇక్కడ బొబ్బల లక్ష్మీనర్సింహస్వామిని ముందుగా దర్శించుకునే సంప్రదాయం చాన్నాళ్లు కొనసాగింది. కాలక్రమేణా ఆ ప్రాచుర్యం, ప్రాధాన్యత కోల్పోయింది.

పాపికొండల గుండా..

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ – నైజాం జమానాలో భద్రాచలానికి రవాణా మార్గాలు అంతగా ఉండేవికావు. ఆ రోజుల్లో హస్నాబాద్ (పాల్వంచ) తాలూకా మీదుగా వచ్చే వారు బూర్గంపాడు మండలం గొమ్మూరు దగ్గర గోదావరి దాటి భద్రాచలం చేరుకునేవారు. రాజమండ్రి వైపు నుంచి వచ్చే భక్తులు కాకులు దూరని కారడవిలో భయంభయంగా ప్రయాణించేవారు. దీంతో గోదావరిలో లాంచీల్లో ప్రయాణిస్తూ పాపికొండల మీదుగా భద్రాచలం చేరుకునేవారు. పాపికొండల దగ్గర గోదావరిలో సుడిగుండాలు సర్వసాధారణం. ఈ సుడిగుండాల పక్కన నుంచి ప్రయాణం చేసే సమయంలో నదీ వంపులో నీటి బుడగల తరహాలో పెద్ద బొబ్బల శబ్దాలు నదీ గర్భం నుంచి భయంకరంగా వినిపించేవి. కళ్లెదురుగా సుడిగుండాలు, హోరెత్తే పెడబొబ్బలాంటి శబ్దాల తీవ్రతకు భక్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ముందుకు సాగేవారు.

ఉగ్ర గోదావరి

భద్రాచలం పడవ ప్రయాణ మార్గంలో పాపికొండల దగ్గర బొబ్బల శబ్దం వినిపించే స్థలం దగ్గరికి రాగానే శాంతించాలని కోరుతూ భక్తులు పసుపు, కుంకుమలను గోదావరిలో చల్లేవారు. క్షేమంగా తమను భద్రాచలం చేర్చమని మొక్కుతూ కొబ్బరి కాయలను కొట్టి ప్రార్థనలు చేసేవారు. దశాబ్దాల పాటు ఈ ఆనవాయితీ కొనసాగింది. ఇదే సమయంలో పాపికొండల మార్గంలో బొబ్బల శబ్దం ఎందుకు వస్తుందనేది, ఎవరికీ అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలింది. ఒకానొక సమయంలో కరువు వచ్చి గోదావరిలో నీటి మట్టం బాగా తగ్గిపోయింది. ఆ సందర్భంలో బొబ్బలు వచ్చే ప్రదేశంలో గజఈతగాళ్లతో వెతికించగా, నదీ గర్భంలో ఓ విగ్రహం కనిపించింది.

నరసింహావతారం

గోదావరి నదీ గర్భంలో దొరికిన ఆ విగ్రహాన్ని నిశితంగా పరిశీలించి నరసింహుడి విగ్రహంగా పండితులు గుర్తించారు. ఆ స్వామి వారిని భద్రాచలానికి తీసుకొచ్చి రామాలయానికి పడమర దిక్కున ఉన్న గుట్టపై కొలువుదీర్చారు. అప్పటి నుంచి బొబ్బల నరసింహుడిగా పూజించడం ప్రారంభించారు. ఆ తర్వాత కాలంలో పాపికొండల దగ్గర బొబ్బల శబ్దం రావడం తగ్గిపోయింది. దీంతో గోదావరిలో ప్రయాణించిన భక్తులు భద్రాచలం చేరుకుని ముందుగా నదీ స్నానం చేసి ఆ తర్వాత తమను క్షేమంగా భద్రాచలం చేర్చిన నరసింహుడిని దర్శించుకునేవారు. ఆ తర్వాత సీతారాముల దర్శనానికి వెళ్లేవారని స్థల పురాణం చెబుతోంది.

క్షేత్ర రక్షకుడు

గోదావరిపై బ్రిడ్జి నిర్మించక పూర్వం భద్రాచలానికి ఇప్పటిలా భక్తుల రాక లేదు. ఆ రోజుల్లో గోదావరిని దాటడం చాలా కష్టంగా ఉండేది. అలా భద్రాచలం చేరుకున్న భక్తులు తమను క్షేమంగా నదిని దాటించిన యోగా లక్ష్మీనరసింహుడిని దర్శించుకునే వారు. ఆ తర్వాతే రామయ్య దర్శనానికి వెళ్లేవారు. అయితే వంతెన నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగయ్యాక పడవ ప్రయాణాలు కనుమరుగయ్యాయి. బస్ స్టేషన్ వైపు నుంచి ఆలయానికి భక్తుల రాక పెరిగింది. దీంతో గోదావరి – రామాలయం మధ్యన ఉన్న బొబ్బల నరసింహుడు (యోగానంద లక్ష్మీనరసింహుడు)ని దర్శించుకోవడం తగ్గిపోయింది. అయితే ఇప్పటికీ ప్రాచీన చరిత్ర తెలిసిన భక్తులు ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు.

కంఠాహారంలో లక్ష్మీదేవి

రాత్రి వేళలో ఆలయం నుంచి పెద్ద ఎత్తున బొబ్బల శబ్దాలు వస్తుండటంతో నరసింహుడిని శాంతింపచేయాలని పండితులు నిర్ణయించారు. దీంతో లక్ష్మీ అమ్మవారికి ఆలయంలో స్థానం కల్పించారు. కంఠాహారంలోకి లక్ష్మీ అమ్మవారిని ఆవాహనం చేసి, ఆ లక్ష్మీహారాన్ని బొబ్బల నరసింహుడికి అలంకరించారు. అప్పటి నుంచి రాత్రి వేళలో ఆలయం నుంచి బొబ్బల శబ్దాలు వినిపించడం తగ్గిపోయిందనేది పలువురు పేర్కొంటున్నారు. లక్ష్మీదేవి రాకతో బొబ్బల నరసింహుడే యోగానంద లక్ష్మీనరసింహుడిగా భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నాడు.

రామయ్య తరఫున పట్టు వస్త్రాలు

ప్రతీ శనివారం, ప్రతీ నెల స్వాతి నక్షత్రం రోజున ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతారు. వైశాఖ శుద్ధ త్రయోదశి నుంచి బహుళ తదియ వరకు లక్ష్మీనరసింహ స్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. శుద్ధ చతుర్దశి రోజున నరసింహ జయంతి, వైశాఖ పూర్ణిమ నాడు తిరుకల్యాణ మహోత్సవాలను జరుపుతారు. ఈ వేడుకలకు రామయ్య తరుపున పట్టువస్త్రాలను, తలంబ్రాలను దేవస్థానం అధికారులు అందిస్తారు. బొబ్బల నరసింహుడిని దర్శించుకుంటే భూతప్రేత బాధలు, దుష్టగ్రహ పీడలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు.

డిగ్రీ గురుకులాల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగింపు

రఘునాథపాలెం: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగించినట్లు రఘునాథపాలెంలోని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం బాలికల కాలేజీ, కొత్తగూడెంలో బాలుర కాలేజీ ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ప్రవేశాలకు దరఖాస్తు గడువు 12వ తేదీ ముగియగా, 15వ తేదీ వరకు పొడిగించినందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.